క్లుప్తంగా

సామాజిక సేవల్లో పోలీసులు



ఎల్కతుర్తి : శాంతిభద్రతల పరిరక్షణలోనే కాకుండా సామాజిక సేవల్లోనూ పోలీసులు భాగస్వాములౌతారని కాజీపేట ఏసీపీ శ్రీనివాస్ తెలిపారు. వేసవి కాలం నేపథ్యంలో బాటసారుల, ప్రజల దాహార్తిని తీర్చేలా మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఎస్సై జక్కుల పరమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఏసీపీ శ్రీనివాస్ ఆదివారం ప్రారంభించి తొలి రోజు సందర్భంగా బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం ఏసీపీ మాట్లాడారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో పోలీసు శాఖ ముందుంటోందని చెప్పారు. సామాజిక సేవల్లోనూ పోలీసులు భాగస్వాములౌతున్నారని తెలిపారు. చలివేంద్రం ఏర్పాటు చేయడం పట్ల ఎస్సై పరమేష్‌ను ఏసీపీ అభినందించారు. బాటసారులు చలివేంద్రాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ ప్రవీణ్‌కుమార్, పోలీస్ సిబ్బంది సురేందర్, కుమారస్వామి, రాజు, నిరంజన్, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

'భట్టి' పాదయాత్ర విజయవంతం చేయండి



ఐనవోలు : నేడు (సోమవారం) హసన్‌పర్తి మండలంలోని ఎల్లాపూర్ నుంచి హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీ జంక్షన్ వరకు తలపెట్టిన సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పాదయాత్రను విజయవంతం చేయాలని టీపీసీసీ కార్యదర్శి భానుప్రకాష్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు సమ్మెట మహేందర్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన ముఖ్యనాయకుల సన్నాహక సమావేశానికి భానుప్రకాష్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క తలపెట్టిన పీపుల్స్ మార్చ్ యాత్ర నేడు హసన్‌పర్తి మండలంలోని ఎల్లాపూర్ నుంచి కాకతీయ యూనివర్సిటీ జంక్షన్ వరకు కొనసాగుతుందని చెప్పారు. తదనంతరం కార్నర్ మీటింగ్ ఉంటుందని తెలిపారు. పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో టీపీసీసీ మాజీ కార్యదర్శి మార్నేని వేంకటేశ్వర్‌రావు, నాయకులు పోలెపల్లి బుచ్చిరెడ్డి, కూస చిరంజీవిరెడ్డి, కొత్తూరి సునీల్, గ్యాదరి భాస్కర్, రహీం పాషా, ఇల్లందుల ఎలీషా, బొమ్మినేని రాకేష్‌రెడ్డి, కట్కూరి బాబు, మానుపాటి రాజు, ఇల్లందుల సారయ్య, ఎల్లస్వామి, కుమార్, కుమారస్వామి, ప్రతాప్ పాల్గొన్నారు.

పరామర్శ

శాయంపేట : భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి వ్యక్తిగత సహాయకుడు తునికల ప్రవీణ్ పటేల్‌ను అతడి తండ్రి శ్రీనివాస్ ఇటీవల మృతి చెందగా ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ రామిశెట్టి లత లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. తొలుత శ్రీనివాస్ చిత్రపటానికి వారు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పోలపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ మేకల శ్రీనివాస్, అజ్మీర ఉమ రఘుసింగ్, గడిపె విజయ విజయ్‌కుమార్, గొట్టిముక్కుల స్వాతి విష్ణువర్ధన్‌రెడ్డి, వావిలాల వేణుగోపాల ప్రసాద్, సోషల్ మీడియా కన్వీనర్ మామిడాల అశోక్, గ్రామ శాఖ అధ్యక్షుడు బూర పైడి తదితరులు పాల్గొని శ్రీనివాస్ చిత్రపటానికి నివాళులర్పించి ప్రవీణ్‌ను పరామర్శించారు.

మిర్చి, పత్తి బస్తాలను షెడ్డుల్లోనే భద్రపర్చాలి

వరంగల్: వాతావరణంలో వచ్చిన మార్పుల దృష్ట్యా అకాల వర్షాలు పడతాయని వాతావరణ శాఖ ప్రకటించిన హెచ్చరికల నేపథ్యంలో వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో విక్రయించేందుకు తీసుకువస్తున్న మిర్చి, పత్తి బస్తాలను రైతులు, అడ్తి, ఖరీదుదారులు యార్డుల్లోని షెడ్డుల్లోనే భద్రపర్చాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు తెలిపారు. రానున్న మూడు రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలను రైతులు, వ్యాపారస్తులు గమనించాలని కోరారు.

కార్మికుల స్థలాల పరిశీలన

నయీంనగర్: హసన్‌పర్తి మండలం మా సిటీలో కేటాయించబోతున్న స్థలాలను మోడిఫైడ్ వలంటరీ రిటైర్డ్ -2002 అజంజాహి మిల్లు కార్మికులు ఆదివారం పరిశీలించారు. ప్రభుత్వం కార్మికుల బాధలు, కష్టాలను పరిగణలోకి తీసుకొని మా సిటీలో కాకుండా అజంజాహి మిల్లు ప్రాంతంలో కార్మికుడికి 200 గజాల చొప్పున 313 మంది కార్మికులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని సూచించారు.

కడగండ్లు మిగిల్చిన వడగళ్లు

జిల్లాలో శనివారం రాత్రి ఉరుములు, మెరుపులు, గాలులతో కురిసిన వడగళ్ల వాన తీవ్ర నష్టం మిగిల్చింది. వరి, మొక్కజొన్న, కూరగాయ పంటలు, మామిడి, పండ్ల తోటలు ధ్వంసమవడంతో రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. చెట్లు, విద్యుత్ స్తంభాలు, ఇళ్లు నేలమట్టమయ్యాయి.

– సాక్షి, నెట్‌వర్క్



కమలాపూర్ : గూడూరులో నేలవాలిన మొక్కజొన్న



కమలాపూర్ : తడిసి కొట్టుకుపోయిన ధాన్యం



కమలాపూర్ : గోడకూలి గాయపడ్డ శివకుమార్



భీమదేవరపల్లి : మండలంలో నేలరాలిన మామిడికాయలు



ఎల్కతుర్తి : పెంచికలపేటలో నేలవాలిన వరిపంట



ధర్మసాగర్ : నేలవాలిన చెట్లు



ఆత్మకూరు : నేలవాలిన మొక్కజొన్న పంట



శాయంపేట : నేలవాలిన వరి పంట



పరకాల: చెట్లను తొలగిస్తున్న పోలీసులు



దామెర : పసరగొండలో దెబ్బతిన్న మొక్కజొన్న

అగ్రనేతల మెప్పు కోసమే..

● మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య



మాట్లాడుతున్న మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య

పరకాల : బీజేపీ అగ్రనేతల మెప్పు కోసమే హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ టీపీసీసీ అధ్యక్షుడు, ఎంపీ ఇనుముల రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య ధ్వజమెత్తారు. రానున్న ఎన్నికల తర్వాత ఈటల రాజేందర్ మళ్లీ బీఆర్ఎస్‌లోకి వెళ్లడం ఖాయమని స్పష్టం చేశారు. పరకాలలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిరిసిల్ల రాజయ్య మాట్లాడారు. ఈటల రాజేందర్‌ను బీఆర్ఎస్ నుంచి గెంటేశారని చెప్పారు. దిక్కులేని పరిస్థితిలో బీజేపీలో చేరారని, ఈటల ఏనాటికైనా బీఆర్ఎస్ మనిషే అని ఆ పార్టీ జాతీయ నాయకులు అభిప్రాయపడుతున్నారని తెలిపారు. ఈ విషయం తెలిసే బీజేపీ నేతల మెప్పు కోసం రేవంత్‌రెడ్డిపై ఈటల రాజేందర్ ఆరోపణలు చేశారని మండిపడ్డారు. ఈటల రాజేందర్ తెలంగాణ కోసం పోరాటం చేశానని చెప్పుకోవడం సరికాదన్నారు. వాస్తవానికి 11 మంది ఎంపీలుగా తాము పార్లమెంట్‌లో అధిష్ఠానంపై ఒత్తిడి తీసుకరావడం వల్లే పార్లమెంట్‌లో బిల్లు ఆమోదం పొంది తెలంగాణ ఏర్పడిందన్నారు. హుజురాబాద్ ఉప ఎన్నికలో గెలిచానని ఈటల విర్రవీగడం సరికాదన్నారు. బీసీ నాయకుడికి పట్టం కట్టాలనే ఆలోచనతోనే హుజురాబాద్ నియోజకవర్గ ప్రజలు ఈటలను గెలిపించారని తెలిపారు. రేవంత్‌రెడ్డిపై ఈటల మరోసారి తప్పుడు ఆరోపణలు చేసిన ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. సమావేశంలో ఆ పార్టీ పరకాల మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ ఒంటేరు రామ్మూర్తి, నర్సక్కపల్లి ఎంపీటీసీ దేవేందర్ నాయకులు చందుపట్ల రాజిరెడ్డి, మంద నాగరాజు, రఘుపతి పాల్గొన్నారు.

ప్లీనరీని విజయవంతం చేయాలి

● బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే అరూరి రమేష్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరూరి రమేష్

ఐనవోలు : బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేసి ఈనెల 25న నిర్వహించనున్న ప్లీనరీని విజయవంతం చేయాలని ఆ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ కోరారు. మండల కేంద్రంలోని డీసీసీబీ అధ్యక్షుడు మార్నేని రవీందర్‌రావు నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే రమేష్ మాట్లాడారు. ప్లీనరీ విజయవంతం కోసం నియోజకవర్గంలోని అన్ని మండలాల, డివిజన్ల నాయకులు సమన్వయం చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు పోలెపల్లి శంకర్‌రెడ్డి, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఈటలను అణచివేయాలని కుట్ర

● బీజేపీ నేతలు భిక్షపతి, విజయ్‌చందర్‌రెడ్డి, సాంబయ్య



మాట్లాడుతున్న మొలుగూరి భిక్షపతి

పరకాల : కాంగ్రెస్ నాయకులు ఈటల రాజేందర్‌ను రాజకీయంగా అణచివేయాలనే కుట్ర చేస్తున్నారని బీజేపీ నేతలు మొలుగూరి భిక్షపతి, ఆ పార్టీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు దేవు సాంబయ్య అన్నారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈటల రాజేందర్‌ను రాజకీయ నిబద్ధత కలిగిన నేతగా అభివర్ణించారు. కాంగ్రెస్ నాయకులు దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీలో గెలిచిన పలువురు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌కు అమ్ముడుపోయిన విషయం రేవంత్‌రెడ్డికి తెలియదా..? అని ప్రశ్నించారు. కేసీఆర్ కనుసన్నల్లోనే కాంగ్రెస్ ముందుకు సాగుతోందని చెప్పారు. దమ్ముంటే రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌తో పొత్తు ఉండదని కాంగ్రెస్ పార్టీ జాతీయ నేతలతో ప్రకటన చేయించాలని రేవంత్‌రెడ్డికి హితవు పలికారు. మాజీ మంత్రిగా, హుజురాబాద్ ఎమ్మెల్యేగా ప్రజలకు ఎనలేని సేవలు అందిస్తున్న ఈటల రాజేందర్‌ను విమర్శించి నైతిక హక్కు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి, ఇతర నాయకులకు లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాచం గురుప్రసాద్, కొత్తగూడెం అసెంబ్లీ ప్రబారి దేవునూరి మేఘనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్పీ.జయంత్‌లాల్, పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి, కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణచారి, నడికూడ మండల అధ్యక్షుడు గోగుల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.విజయ్, నాయకుడు దుబాసి వెంకటస్వామి, మామిండ్ల సారంగపాణి, దార్న నారయణదాసు, బాసాని సోమరాజు, బలభద్ర రాజు, మంద రామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా బ్రహ్మోత్సవాలు

● అంగరంగ వైభవంగా ప్రారంభం
● లోకాయుక్త జస్టిస్ సీవీ.రాములు హాజరు



బ్రహ్మోత్సవాల సందర్భంగా గణపతి పూజ నిర్వహిస్తున్న చైర్మన్ బాసాని సూర్యప్రకాష్ దంపతులు

శాయంపేట : మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర, శివ మార్కండేయ ఆలయ సముదాయాల్లో చేపట్టిన దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం కనుల పండువగా సాగాయి. దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభం కాగా ఆలయ కమిటీ చైర్మన్ బాసాని సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో తొలుత అర్చకులు మార్త రాజ్‌కుమార్, చిందం కరుణాకర్, రంగు యాదగిరి, తాటి రమేష్ ఆధ్వర్యంలో గణపతి పూజ, అంకురార్పణ కార్యక్రమాలను వేద మంత్రోచ్చారణల నడుమ ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం, పరిసర గ్రామాల నుంచి భక్తుల భారీ సంఖ్యలో బ్రహ్మోత్సవాలకు హాజరై తిలకించారు. బ్రహ్మోత్సవాల ప్రారంభానికి హైకోర్టు రిటైర్డ్ జడ్జీ, లోకాయుక్త జస్టిస్ సీవీ.రాములు హాజరు కాగా పురోహితులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ విశిష్టతను వివరించారు. అనంతరం దేవుని చెరువును సీవీ.రాములు సందర్శించి పరిశీలించారు. ఆయకట్టు విస్తీర్ణం, ఇతర వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమీపంలోని గుట్టను పరిశీలించి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి అనుకూలంగా ఉంటుందని తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ఆవరణలో తాగునీటి, చలువ పందిళ్లు, ఇతరత్రా సదుపాయాలు కల్పించారు. కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలీ సంఘం మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు బాసాని పద్మ, ప్రసన్నాంజేయులు, దామరకొండ కొమురయ్య, బాల్నె తిలక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



జస్టిస్ రాములుకు స్వాగతం పలుకుతున్న వేద పండితులు

రేవంత్‌రెడ్డిపై ఆరోపణలు దుర్మార్గం

● ఈటల రాజేందర్ దిష్టిబొమ్మ దహనం



ఈటల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ఎల్కతుర్తి : టీపీసీసీ అధ్యక్షుడు, ఎంపీ ఇనుముల రేవంత్‌రెడ్డిపై ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఆరోపణలు చేయడం దుర్మార్గమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుకినే సంతాజీ అన్నారు. రేవంత్‌రెడ్డిపై ఆరోపణలను నిరసిస్తూ ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో హనుమకొండ-కరీంనగర్ ప్రధాన రహదారిపై ఈటల రాజేందర్ దిష్టిబొమ్మను ఆదివారం దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంతాజీ మాట్లాడారు. టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి ప్రజాసమస్యలపై క్రియాశీలకంగా ఉద్యమిస్తున్నారని చెప్పారు. రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే రాజేందర్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈటల రాజేందర్‌ను ఎక్కడ కూడా తిరగకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మండ సుమన్ గౌడ్, శీలం అనిల్‌కుమార్, శనిగరం వెంకటేష్, హింగె శ్రీకాంత్, పిన్నింటి సుష్మారెడ్డి, అంబాల శ్రీకాంత్, గొడిశాల నరేష్, గొడిశాల ప్రదీప్, సుకినె రాము, సుకినె ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

25న రేషన్ డీలర్ల సమావేశం

ఆత్మకూరు : ఈనెల 25న హనుమకొండలో నిర్వహించనున్న రేషన్ డీలర్ల సమావేశాన్ని విజయవంతం చేయాలని రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షురాలు వంగర వాణి రామరాజు కోరారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రేషన్ డీలర్లకు గౌరవ వేతనం ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మండలంలోని రేషన్ డీలర్లందరూ హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. తద్వారా డీలర్ల సత్తా చాటాలని ఆకాంక్షించారు. సమావేశంలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి వెలిదె వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యురాలు బూర సునిత రాజబాబు, మండల కోశాధికారి ఆర్షం రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

భూమిపై అనవసర రాద్ధాంతం



మాట్లాడుతున్న వెంకటయ్య, తదితరులు

పరకాల : పరకాల మున్సిపాల్టీ పరిధిలోని 9వ వార్డులోని సర్వే నంబర్ 609లో తాము కొనుగోలు చేసిన 1.13 ఎకరాల భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తూ అనవసర రాద్ధాంతం చేస్తున్నారని పరకాల వతన్‌దార్, సేత్ సంధి, నీరడి సంఘం (రెవెన్యూ ఉద్యోగులు) అధ్యక్షుడు దేవు వెంకటయ్య తెలిపారు. పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మీడియాకు వివరాలు వెల్లడిస్తూ మాట్లాడారు. 1969లో తాము కొనుగోలు చేసిన భూమి తమదేనంటూ విక్రయించిన వ్యక్తి కుటుంబ సభ్యులు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని చెప్పారు. తాము నేరేళ్ల నర్సయ్య అనే వ్యక్తి నుంచి కొనుగోలు చేసి భవన నిర్మించామని, ఇంటి పన్ను సైతం చెల్లిస్తున్నామని వివరించారు. ఇప్పటికైనా అనవసర రాద్ధాంతం మానుకోవాలని కోరారు. సమావేశంలో సంఘం కార్యదర్శి బందెల ప్రేమ్‌కుమార్, నాయకులు కొండమల్ల రవి, రమేష్, సాంబయ్య, యాదయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతులను ఆదుకోవాలి

● టీపీసీసీ సభ్యుడు సత్యనారాయణరావు



దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న సత్యనారాయణరావు

శాయంపేట : శనివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి భారీగా నష్టం వాటిల్లిందని టీపీసీసీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. మండలంలో వర్షాల వల్ల దెబ్బతిన్న మొక్కజొన్న, ఇతర పంటలతోపాటు అరటి, పుచ్చ, మామిడితోటలను ఆయన ఆధ్వర్యంలోని బృందం ఆదివారం సందర్శించి పరిశీలించింది. ఈ సందర్భంగా సత్యనారాయణరావు మాట్లాడారు. మండలంలో వర్షాల వల్ల మొక్కజొన్న, వరి పంటలతోపాటు అరటి, పుచ్చ, మామిడి తోటలు ధ్వంసం అయ్యాయని తెలిపారు. ప్రభుత్వం, వ్యవసాయ శాఖ అధికారులు సత్వరమే స్పందించి పంట నష్టంపై సమగ్ర విచారణ చేయాలని సూచించారు. పంట నష్టపోయిన రైతులందరికీ ఎకరానికి రూ.50 వేలు చొప్పున పరిహారం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని సత్యనారాయణరావు డిమాండ్ చేశారు. అకాల వర్షానికి పంటల నష్టం వాటిల్లడం బాధాకరమన్నారు. బాధిత రైతులను పరామర్శించారు. పరిహారం ఇప్పించేలా పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, నాయకులు చిందం రవి, చింతల రవిపాల్, మహ్మద్ రఫీ, నిమ్మల రమేష్, మరేపల్లి రాజు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో జేఎల్ఎంకు గాయాలు

ధర్మసాగర్ : విద్యుదాఘాతంతో జూనియర్ లైన్‌మెన్ (జేఎల్ఎం)కు తీవ్ర గాయాలైన ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. విద్యుత్ శాఖ అధికారుల కథనం ప్రకారం.. శనివారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం కురవగా మండల కేంద్రంలో చాలా చోట్ల విద్యుత్ స్తంబాలు విరిగాయి, కొన్ని చోట్ల చెట్లు విరిగి విద్యుత్ తీగలపై పడ్డాయి. దీంతో అధికారులు రాత్రి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. కాగా సబ్‌స్టేషన్ నుంచి ధర్మసాగర్ పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా చేసే 11 కేవీ పోల్‌పై ఇన్సులేటర్ పగిలిపోవడంతో ఆదివారం ఉదయం దాని స్థానంలో కొత్తది అమర్చి విద్యుత్ సరఫరా చేద్దామని జేఎల్ఎం నరేంద్ర ప్రసాద్ ఆ స్తంబం మీదకు వెళ్లాడు. ఈ క్రమంలో అతడు ఎల్సీ తీసుకోవడం కన్‌ఫామ్ చేసుకోకుండానే స్తంబం ఎక్కి పనులు చేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ షాక్ తగిలి కింద పడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. ఆయన్ను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. ఈ ఘటన మండలంలో కలకలం రేపింది.



రేపు నియోజకవర్గ స్థాయి ప్లీనరీ

కాశిబుగ్గ: భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 25వ తేదీన నియోజకవర్గ ప్లీనరీని ఘనంగా నిర్వహించేందుకు ఓసిటీలో పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నట్లు వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ తెలిపారు. ఓసిటీ మైదానంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాజీ మార్కెట్ చైర్మన్ టి.రమేష్‌బాబు, కార్పొరేటర్లు గుండేటి నరేంద్రకుమార్, దిడ్డి కుమారస్వామితో కలిసి ఎమ్మెల్యే వివరాలు వెల్లడించారు. ప్లీనరీకి ఆరువేల మంది హాజరవుతారని తెలిపారు. 25న ఉదయం నియోజకవర్గంలోని 46జెండా గద్దెల వద్ద జెండా పండుగ, 26న పుప్పాలగుట్టలోని పార్కులో నిర్వహిస్తున్న తొలి ఆత్మీయ సమ్మేళనం, 27న లెజిస్లేటివ్ సమావేశం, 30న సచివాలయ ప్రారంభోత్సవం, మే1న మేడే కార్యక్రమాలు ఉంటాయన్నారు.

మల్లన్న భక్తులపై తేనెటీగల దాడి



గాయపడిన భక్తులు

ధర్మసాగర్ (వేలేరు) : మండలంలోని మల్లికుదుర్ల గ్రామ శివారులోని శ్రీగట్టు మల్లికార్జునస్వామి దర్శనానికి వచ్చిన భక్తులపై తేనెటీగలు దాడి చేశాయి. హైదరాబాద్ నుంచి ఒకే కుటుంబానికి చెందిన దాదాపు 10 మంది ఆదివారం ఉదయం మల్లికార్జునస్వామి దర్శనానికి రాగా ఆలయం సమీపంలో ఉన్న తేనెటీగలు ఒక్కసారిగా వారిపై దాడి చేశాయి. స్థానికులు సమాచారం ఇవ్వడంతో 108 అంబులెన్స్ సిబ్బంది అక్కడకు చేరుకుని బాధితులకు ప్రథమ చికిత్స అందించారు. అనంతరం వారిని వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.